క్లుప్తంగా

వేణుగోపాలస్వామికి లక్ష తులసి పూజ



ఊలపల్లిలో ప్రత్యేక అలంకరణలో ఉన్న వేణుగోపాలస్వామి

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో లక్ష తులసి పూజ ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయం వద్ద శ్రీనివాసుల సత్యనారాయణ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా గణపతి పూజ, అభిషేకాలు, కుంకుమార్చన, చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఇవో కాళ్ళకూరి సుబ్రహ్మణం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ



జి.మామిడాడలో గొడుగులు పంపిణీ చేస్తున్న వెంకటరెడ్డి

పెదపూడి: వచ్చే వేసవిలో ఎండ నుంచి రక్షణ, వేసవి తాపాన్ని తగ్గించేందుకు నీడ ఉండాలనే ఉద్దేశంతో చిరు వ్యాపారులకు ఉచితంగా గొడుగుల పంపిణీ చేపట్టామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ మంగళవారం నిర్వహించారు. గొడుగులను అధ్యక్షుడు వెంకటరెడ్డి ఏర్పాటు చేశారు. 12 మంది వ్యాపారులకు గ్రామంలోని మెయిన్ రోడ్డు, గండ్రేడు, మార్కెట్ సెంటర్లో ఎలాంటి నీడ లేక ఎండలోనే పండ్లు, కూరగాయలు, అమ్ముకొనే చిరు వ్యాపారులకు వీటిని అందించారు. క్లబ్ ప్రతినిధులు పప్పు రామకృష్ణారెడ్డి, మండ రాజారెడ్డి, ద్వారంపూడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ



పెదపూడిలో సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

పెదపూడి: కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్తిరాజు అన్నారు. పెదపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళశారం సీఐటీయూ 17వ అఖిలభారత మహాసభ సందర్భంగా సంఘ మండల శాఖ అధ్యక్షుడు వాసపల్లి శివ జెండా ఆవిష్కరించారు. సత్తిరాజు మాట్లాడుతూ దేశంలో కార్మికుల హక్కులు హరించే లేబర్ కోడ్లు రద్దు చేయాలన్నారు. అనంతరం మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

డాక్టర్ రాజుకు ఉత్తమ సేవల అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ రాజు

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్.రాజు ఉత్తమ సేవల అవార్డును కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా ఉత్తమ సేవలు అందించినందుకు ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు. కలెక్టరేట్‌లో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ వసుంధర, జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఆయనను సన్మానించారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



పాలచర్లలో క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలోని మూడు మండలాలలో మూడు రకాల క్రీడలను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఖేలో రాజానగరంలో భాగంగా మండలంలోని పాలచర్లలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన సందర్శించారు.

మశూచి... జీవాలకు ప్రాణాంతకం

- గొర్రెలు, మేకలకు ముందస్తు టీకాలతో ఫలితం
- పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పశు వైద్యాధికారులు



మేకలు, గొర్రెల మంద (ఫైల్)

బిక్కవోలు: అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో వందలాది కుటుంబాలు గొర్రెలు, మేకల పెంపకంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. అయితే మశూచి వ్యాధి కారణంగా జీవాలు మృత్యువాత పడుతుండడంతో పెంపకందారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పైగా నవంబర్ నుంచి ఏప్రిల్ వరకూ మశూచి వ్యాధి ప్రబలే అవకాశాలు మరింత ఎక్కువ. అందుకే గొర్రెలు, మేకలకు ముందస్తుగా టీకాలు వేయిస్తే మంచి ఫలితం ఉంటుందని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. రానున్న నాలుగు నెలల కాలం గొర్రెలు, మేకల పెంపకందారులు మరింత అప్రమత్తంగా ఉండాలంటున్నారు.

15,136 గొర్రెలు, మేకలు

అనపర్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి 15,136 గొర్రెలు, మేకలు ఉన్నాయి. అనపర్తి మండలంలో 3,144 గొర్రెలు, 481 మేకలు ఉన్నాయి. అలాగే బిక్కవోలు మండలంలో 3,660 గొర్రెలు, 695 మేకలు, పెదపూడి మండలంలో 44 గొర్రెలు, 294 మేకలు, రంగంపేట మండలంలో 3,679 గొర్రెలు, 3,139 మేకలు ఉన్నాయి.

అప్రమత్తతే శ్రీరామరక్ష

గాలి ద్వారా వ్యాపించే మశూచితో గొర్రెలు ఆహారం తీసుకోక, శ్వాస ఆడక ప్రాణాలు కోల్పోతాయి. దాణా తొట్టెలు, నీటి తొట్టెల ద్వారా ఇది వ్యాప్తిచెందే అవకాశమెక్కువ. మశూచి వ్యాధి సోకిన వారం రోజులకు గొర్రెల్లో లక్షణాలు బయటపడతాయి. వ్యాధి సోకిన గొర్రెలకు జ్వరం తీవ్రంగా ఉంటుంది. చర్మంపై వెంట్రుకలు లేని భాగం, తోక కింద, పెదవులు, ముక్కు రంధ్రాలు, పాల పొదుగుపై ఎర్రని దద్దుర్లు పొక్కులు ఏర్పడతాయి. శ్వాసకోశ వ్యవస్థను వ్యాధి ఆశిస్తే గొర్రెలు శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. జీర్ణకోశ వ్యవస్థను ఆశిస్తే రక్తపు విరేచనాలు అవుతాయి. చూడు గొర్రెలకు వ్యాధి ప్రబలితే మరింత ప్రమాదం. నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు గొర్రెలకు మశూచి వ్యాధి సోకే అవకాశమెక్కువ. అందుకే గొర్రెలకు ముందస్తుగా వ్యాధి నివారణ టీకాలు వేయించాలి.

అందుబాటులో మందులు



మశూచి వ్యాధికి పశు వైద్యశాలల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. సకాలంలో గుర్తించి వైద్యం అందిస్తే గొర్రెలు, మేకలు చనిపోకుండా కాపాడుకోవొచ్చు. సకాలంలో ముందస్తుగా టీకాలు వేయించడం ద్వారా పెంపకందారులు నష్టపోకుండా ఉంటారు.

– డాక్టర్ శ్రీనివాస్, పశు సంవర్థక శాఖ ఏడీ, అనపర్తి

13న గడప గడపకూ..

అనపర్తి: ఈ నెల 13న స్థానిక గ్రామ సచివాలయం–5 పరిధిలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడప గడపకూ కార్యక్రమం విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషిచేయాలని అన్నారు. ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, వార్డు సభ్యుడు డేవిడ్‌రాజు, పంచాయతీ కార్యదర్శి మల్లిడి విజయ్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ వేలంగి రాజు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

రంగంపేట: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదని తహసీల్దార్ వాకాడ అమ్మాజీ, ఎస్సై టి.రామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం జాయింట్ ఇన్‌స్పెక్షన్ టీమ్ రెవెన్యూ, యానిమల్ హస్బెండ్రీ, పోలీసు ఆధ్వర్యంలో రంగంపేట, వడిశలేరు, పెదరాయవరం గ్రామాల్లో గతంలో కోడి పందేలు నిర్వహించిన బరులను పరిశీలించారు. ఇప్పటి వరకూ కోడి పందేల్లో కత్తులు కట్టే అలవాటున్న 10 మందిని బైండోవర్ చేశామన్నారు.

నిరుపేదలకు బాసటగా సీఎం జగన్

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు బాసటగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన అనపర్తిలో మంగళవారం రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలోని బాలికోన్నత పాఠశాల వీధి, పల్లీల రామాలయం వీధి, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే ప్రతీ ఒక్కరినీ పలకరిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరిస్తూ, సంబంధిత కరపత్రాలను అందిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు పూల వర్షం కురిపిస్తూ మహిళలు అడుగడుగునా మంగళహారతులిస్తూ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలతో పేదల తలరాతలు మారుతున్నాయని అన్నారు. దీంతో గడప గడపకూ కార్యక్రమంలో ప్రతీ ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ, ఆప్యాయత దక్కుతున్నాయని తెలిపారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పార్టీలకు అతీతంగా లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని అన్నారు. సంక్షేమ పథకాల అమలు ద్వారా నిరుపేదలకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి మీ దీవెనలు అందజేయాలని కోరారు. ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ కర్రి దాసు, గ్రామ కమిటీ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు తుమ్మా రాజేశ్వరి, వార్డు సభ్యులు బొడ్డు సునీత, పార్టీ నాయకులు సబ్బెళ్ల కృష్ణారెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్ బి.దివ్యశ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మల్లిడి విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో అందరి సంక్షేమం



మునగాలలో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- మునగాలలో గడప గడపకూ మన ప్రభుత్వం

మధురపూడి: సంక్షేమానికి చిరునామాగా జగన్ ప్రభుత్వం నిలిచిందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మునగాల గ్రామంలో మూడోరోజు మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యతిస్తూ, బడుగుల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. నాడు – నేడు పథకంతో పాఠశాల అభివృద్ధి, సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, మంచినీటి ట్యాంకుల నిర్మాణం, శ్మశాన వాటిక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని బీసీ పేటలో ఇంటింటికీ వెళ్లి అందరినీ పలుకరిస్తూ, పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. స్థానికులు చెప్పిన మురుగునీటి కాలువల నిర్మాణం చేస్తామన్నారు. అలాగే జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు త్వరలో ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో 150 గడపలు తిరిగారు. కార్యక్రమంలో మునగాల ఎంపీటీసీ సభ్యుడు చింతాకుల లోవరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నాగా గోవిందు, పార్టీ నాయకులు గిద్దా సత్యనారాయణ, మండపాక వెంకటపతి, నాగులాపల్లి పెద్ద వెంకన్న, తోరాట శ్రీను, తోరటి సత్యప్రసాద్, నాగులాపల్లి ఫణికుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జక్కంపూడి స్పోర్ట్స్ ఫెస్టివల్



సీతానగరం హైస్కూల్లో కబడ్డీ పోటీలు



గాడాలలో జరుగుతున్న వాలీబాల్ పోటీలు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. రాజానగరం నియోజకవర్గ స్థాయిలో జక్కంపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జక్కంపూడి మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో భాగంగా రెండోరోజు మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు టీమ్‌లు తలపడ్డాయి. ఏడీవీ శ్రీనివాస్, వి.శ్రీనివాస్, ఎస్.వీరబాబు, ఏడీ ప్రసాద్, డి.శ్రీనుబాబు, వై.వెంకటేశ్వర్లు, బి. సూరిబాబు, కె.రెడ్డియ్య, ఎస్.అప్పన్న, వి.అశోక్ కుమార్, ఆర్.నాగేశ్వరరావు, సీహెచ్ రాజశేఖర్, ఎస్.నాగరాజు కబడ్డీ రిఫరీలుగా వ్యవహరిస్తున్నారు. సోమవారం రాత్రి ప్రారంభమైన పోటీల్లో గరగపాలెంపై వెలమపేట (సీతానగరం), కోటికేశవరంపై పురుషోత్తపట్నం విజయం సాధించాయి. రెండోరోజు మంగళవారం ఇనుగంటివారిపేటపై కోరుకొండ, శ్రీరామపురంపై సింగవరం, నల్గొండపై చినకొండేపూడి, చినకొండేపూడిపై కనుపూరు, రఘుదేవపురం (కోటదుర్గ టీమ్)పై శ్రీరంగపట్నం, రఘుదేవపురంపై కొత్తతుంగపాడు గెలిచాయి. సీతానగరంపై భూపాలపట్నం, బొబ్బిల్లంకపై దివాన్‌చెరువు, పాతతుంగపాడుపై పుణ్యక్షేత్రం ,సింగవరంపై కణుపూరు విజయకేతనం ఎగుర వేశాయి.

గాడాలలో వాలీబాల్ పోటీలు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలో మంగళవారం వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకూ 16 టీములు తలపడ్డాయి. వీటిలో ఆరు టీమ్‌లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి. పోటీల్లో భాగంగా బుధవారం ఉదయం సెమీఫైనల్స్, రాత్రి ఫైనల్ పోటీ జరుగుతుంది. ఈనెల 12వ తేదీన బహుమతులు ప్రదానం చేస్తారు. ఈ పోటీలకు రిఫరీలుగా ఏ.శ్రీనివాసరావు, ఏ.సుధాకర్, సత్యప్రసాద్, ఇబ్రహీం, సూర్యమోహన్, సీతాపతి, గణేష్, నాగరాజు వ్యవహరించారు.

13 నుంచి క్రికెట్ టోర్నీ

అనపర్తి: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని కుతుకులూరులో ఈ నెల 13 నుంచి శ్రీ భక్తాంజనేయస్వామి ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వహణ కమిటీ ప్రతినిధి పడాల సురేష్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించే ఈ పోటీలు ఈ నెల 13 నుంచి 18 వరకు జరుగుతాయని, విజేత జట్టుకు రూ. 25 వేలు, రన్నర్ జట్టుకు రూ.15 వేలు నగదు బహుమతి, షీల్డ్ అందజేయనున్నట్లు తెలిపారు. ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడితోపాటు వ్యక్తిగత బహుమతులు అందించనున్నట్లు సురేష్‌రెడ్డి తెలిపారు.

ఆచారాల విశిష్టత తెలియజేయాలి



సంబరాలలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

బిక్కవోలు: ఆచారాల విశిష్టత విద్యార్థులకు తెలియజేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం బలభద్రపురం గ్రామంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న సంక్రాంతి సంబరాల కార్యక్రమాని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ఆచారాలను సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. అనంతరం విద్యార్థుల కోలాటం, సంప్రదాయ నృత్యాలు, వేషధారణలను తిలకించారు. సర్పంచ్ బుంగా రామారావు, శాప్ డైరెక్టర్ అలేఖ్య, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వేగంగా భూ హక్కు పత్రాల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్

బిక్కవోలు: భూహక్కు పత్రాల పంపిణీ వేగంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అన్నారు. మంగళవారం బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. రీ సర్వే పనులు, వైఎస్సార్ జగనన్న భూ రక్ష, భూ హక్కు పత్రాల పంపిణీ విషయాలను పరిశీలించారు. ఎంఎస్ఎల్ పాయింట్ వద్ద ఎఫ్‌సీఐ గోడౌన్ తనిఖీ చేసి సరఫరా అవుతున్న రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ పూర్తి అయ్యిందన్నారు. మిల్లర్ నుంచి ఎఫ్‌సీఐ గోడౌన్‌లకు సీఎంఆర్ రైస్ తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మండల పరిధిలో ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమం అయిన నవరత్నాలులో భాగంగా భవన నిర్మాణ రంగంలోని పనులను వేగంగా చేయడానికి లబ్ధిదారులకు బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించాలని సూచించారు. ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి, డీఎస్‌వో ప్రసాద్‌రావు, డీఎం ఆర్.తనుజా, ఏడీ సర్వే పి.లక్ష్మణారావు, తహసీల్దార్ పోసిబాబు, ఎంఎస్‌వో పాయింట్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు



సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంబరాలు



దివాన్ చెరువు శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో..

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రాజానగరం: విద్యార్థులకు చదువుతో పాటు మన పండగలు, వాటి విశిష్టత గురించి తెలియజేయాలని దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ఏఎస్ఎన్ మూర్తి అన్నారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు.

ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు



కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న శైలశ్రీ శిష్య బృందం

అనపర్తి: స్థానిక శ్రీ శారదా సంగీత కళాసమితి ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మంటపంలో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న 24వ శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఘనంగా ముగిశాయి. మంగళవారం విజయవాడకు చెందిన శ్రీ నృత్య కళానిలయం నాట్యాచారిణి జి.శైలశ్రీ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. సుమారు 20 మంది కళాకారులు పలు నృత్య రూపకాలను ప్రదర్శించారు. లైవ్ ఆర్కెస్ట్రా సహాయంతో జరిగిన ఈ కార్యక్రమంలో కుమార సూర్యనారాయణ, సుధా శ్రీనివాస్ గాత్ర సహకారం అందించగా గణపతి వయోలిన్‌పై, ఫణి మృదంగం, కుమార్ వేణువు, అశోక్‌కుమార్ వేణువు, సత్య నందిని నట్టువాంగం సహకారం అందించారు. పారిశ్రామికవేత్త సబ్బెళ్ల అమ్మిరెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నల్లమిల్లి వీర్రెడ్డి, మారెళ్ల గంగరాజుశర్మ, సమితి ప్రతినిధులు తమలంపూడి చిన ఆదిరెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, మునీశ్వరరెడ్డి, కొవ్వూరి రఘునాథరెడ్డి, సక్కు పాల్గొన్నారు.

అధిక రక్తపోటుపై అశ్రద్ధ వద్దు



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ రోహిత్

రంగంపేట: అధిక రక్తపోటును అశ్రద్ధ చేస్తే ప్రాణానికే ముప్పని కాకినాడకు చెందిన మెడికవర్ హాస్పిటల్ న్యూరో వైద్య నిపుణుడు డాక్టర్ రోహిత్ అన్నారు. మంగళవారం కమ్యూనిటీ పారా మెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాజానగరం, రంగంపేట మండలాల ఆధ్వర్యంలో రంగంపేట మండల అధ్యక్షుడు బుడ్డిగ అప్పారావు అధ్యక్షతన రంగంపేట మండలంలోని వడిశలేరులో గల డాక్టర్ గన్ని భాస్కరరావు వ్యవసాయ క్షేత్రంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రోహిత్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రాథమికంగా పరీక్షలు చేసినప్పుడు ముందుగా బీపీని పరీక్షించి హైబీపీ ఉంటే జాగ్రత్తలు సూచనలు తెలపాలని అన్నారు. మెదడుకు వచ్చే రుగ్మతలు, బ్రెయిన్‌స్ట్రోక్ విషయంలో చేసే ప్రథమ చికిత్సల గురించి వివరించారు. పీఎంపీ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, జిల్లా అధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు, జిల్లా కార్యదర్శి బళ్ళా శ్రీనివాసరావు, మండల కార్యదర్శి కాపా సత్తిబాబు, కోశాధికారి ఎ.నాగేశ్వరరావు, డి.గోపి, డి.వీర్రాజు, జి.రత్నకుమార్, ఎం.చంద్రశేఖర్‌లతో పాటు సభ్యులు హాజరయ్యారు. అనంతరం డాక్టర్ రోహిత్‌తో పాటు ఇటీవల నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజులను సభ్యులు సత్కరించారు.

ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని కలిసిన కృష్ణారెడ్డి



ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న కృష్ణారెడ్డి

అనపర్తి: అనపర్తి మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా నియమితులైన రామవరం గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. కృష్ణారెడ్డి నియామకంపై వారు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలుపుతూ సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడి పనిచేసినవారికి పార్టీలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. అనంతరం ఏఎంసీ చైర్మన్‌గా తన నియామకానికి కృషిచేసిన ఎమ్మెల్యే దంపతులకు కృష్ణారెడ్డి పుష్పగుచ్ఛాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు. రామవరం సర్పంచ్ గిరడా గంగా భవానిరాజు, ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు కర్రి సురేంద్రరెడ్డి, పులగం అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం శివారున పేకాటాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ మంగళవారం తెలిపారు. వారి నుంచి రూ.2,250 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.

విద్యార్థులతో ఇసుక పని



ఇసుకను సంచుల్లోకి ఎత్తుతున్న విద్యార్థులు

రాజానగరం: పాఠశాల ముంగిట ఉన్న గోదావరి ఇసుకను విద్యార్థులతో ఎత్తించడాన్ని స్థానికులు తప్పుపడుతున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. మండలంలోని సూర్యారావుపేట ప్రాథమిక పాఠశాల వద్ద మంగళవారం ఈ ఘటన జరిగింది. నాడు –నేడు పథకంలో ఈ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల కోసం వచ్చిన గోదావరి ఇసుకను పక్కనే ఉన్న రోడ్డుపై గుట్టగా వేశారు. అది జారుకుంటూ రోడ్డంతా పరుచుకుంది. ఈ సమయంలో విద్యార్థులతో సంక్రాంతి సంబరాలు నిర్వహించి, పండుగ విశిష్టతను తెలియజేయాలనుకున్న ఆ పాఠశాల ఉపాధ్యాయుడు రత్నాకర్ చేసిన అనాలోచిత చర్య విమర్శలకు తావిచ్చింది. విద్యార్థులతో ఇసుకను దగ్గరుండి చేయించడాన్ని చూసిన స్థానికులు ఆ ఉపాధ్యాయునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదంతా ఎవరో వీడియో తీసి, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు

రంగంపేట: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో అందించే వైద్య సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ పి.శ్యాంకుమార్ కోరారు. రంగంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని వడిశలేరు గ్రామంలో సచివాలయం–2 వద్ద నిర్వహించిన శిబిరంలో ఆయన వైద్య సేవలు అందించారు. గ్రామంలోని సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఎంపీహెచ్‌ఈఓ శంకర్ పాల్గొన్నారు.

సింగవరంలో..

సీతానగరం: సింగవరం సచివాలయంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 126 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు శుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం మంచంపై ఉన్న రోగుల ఇంటికి నేరుగా వెళ్లి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అరుణ, ఎంఎల్‌హెచ్‌పీలు చంద్రశేఖర్, మౌనిక, ఆశ వర్కర్లు వెంకటలక్ష్మి, సూర్యకుమారి పాల్గొన్నారు.